క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ విజేత 'హులికుంట'



ట్రోఫీతో హులికుంట జట్టు

రొళ్ల: మండల పరిధిలోని హులికుంట గ్రామంలో సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని 'హులికుంట యూత్ క్రికెట్ అసోసియేషన్' ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ నిర్వహించారు. మొత్తం 22 జట్లు టోర్నీలో పాల్గొనగా హులికుంట జట్టు విజేతగా నిలిచింది. సోమవారం సాయంత్రం హులికుంట, అగళి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా హులికుంట జట్టు గెలుపొందింది. విజేతకు జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు మొదటి బహుమతి కింద రూ.15 వేలు, రన్నరప్‌గా నిలిచిన అగళి జట్టుకు సర్పంచ్ కరియమ్మ తనయుడు రవికుమార్ రూ.7,500 అందించారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయండి



లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి పంచాయతీలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు నెలా నెలా సక్రమంగా ఇంటి వద్దకే నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని సర్పంచ్ రంగనాథ్ ఎండీయూ ఆపరేటర్‌కు సూచించారు. మంగళవారం సిద్దగిరి ఎస్సీ కాలనీ వాసులు నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని మెళవాయి గ్రామ సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీంతో సర్పంచ్, ఎంపీటీసీ గంగరత్నమ్మ వెంటనే ఎండీయూ వాహనాన్ని గ్రామంలోకి పంపించి లబ్ధిదారులకు ఇంటి వద్దకే సరుకులను పంపిణీ చేయించారు. ఎండీయూ వాహనం ద్వారా సరుకులను పంపిణీ చేయిస్తామని సర్పంచ్ కార్డు లబ్ధిదారులకు తెలిపారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు విభజన సమయంలో ఇచ్చిన హామీలు, కేంద్రీయ విద్యాసంస్థల ఏర్పాటుపై మాటతప్పిన ప్రధాని మోదీ ఏ రకంగా రాష్ట్రంలో పర్యటిస్తారో చెప్పాలన్నారు. అనంతపురంలో కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సరిగ్గా నిధులు కేటాయించలేదన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, హర్షకుమార్, తరుణ్, నిహాల్, గురునాథ్, వినోద్, అభి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

హిందూపురం టౌన్: లేపాక్షిలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం లేపాక్షిలో ప్రధానిని ఆంధ్రప్రదేశ్ సమస్యలు, విభజన హామీలు, ప్రత్యేక హోదాపై కలిసేందుకు వెళ్తున్న నాయకులను పట్టణంలో పోలీసులు అడ్డగించి అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు అమానుల్లా, పట్టణ అధ్యక్షుడు జమీల్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఇంటి పైకప్పుపై తెగిబడ్డ విద్యుత్ తీగలు

గుడిబండ: మండల పరిధిలోని మోరబాగల్ గ్రామంలో 11 కేవీ విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. మోరబాగల్ ఎస్సీ కాలని మీదుగా జంబులబండ వయా గుడిబండ, గుణిమోరబాగల్ గ్రామానికి వ్యవసాయ బోరుబావులకు 11 కేవీ విద్యుత్ తీగలు లాగారు. అయితే మోరబాగల్ ఎస్సీ కాలనీలో ఓ ఇంటి పైకప్పు మీద విద్యుత్ తీగలు తెగిబడ్డాయి. ఆ సమయంలో స్థానికంగా ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకొన్న వెంటనే గ్రామ ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. వైర్లు లాగి దాదాపు 20 ఏళ్లు పైబడి కావడంతో వైర్లు దెబ్బతిన్నాయని, ఇలా జరగడం ఇది మూడో సారని ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ వైర్లు కాలనీ మీదుగా కాకుండా సమీప వ్యవసాయ పొలాల మీదుగా వైర్లు లాగాలని సర్పంచ్ తిప్పేస్వామి, ఎంపీటీసీ రాజన్న, గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్టి



హిందూపురం: పురవీధులగుండా సాగుతున్న రథోత్సవం



పరిగి: సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పలుచోట్ల కనుల పండువగా రథోత్సవం

హిందూపురం: సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకుని స్థానిక శ్రీనివాసనగర్‌లోని సప్తఫణి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ బ్రహ్మరథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అర్చకులు మంజునాథశర్మ, చంద్రమౌళి ఆధ్వర్యంలో సప్తఫణి సుబ్రహ్మణ్యస్వామికి పంచమృతాభిషేకం చేసి విశేషంగా వెండి ఆభరణాలతో అలంకరించారు. ఆలయ ఆవరణంలో గణపతి, నవగ్రహ హోమాలు చేసి పూర్ణాహుతి చేశారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు తరలించి సప్తఫణి సుబ్రమణ్యం స్వామి ఆలయ ఆవరణంలోని నాగపడకలకు పాలాభిషేకం పూజలు నిర్వహించారు. షష్ఠి పూజలతో ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది.

కనుల పండువగా బ్రహ్మరథోత్సవం

సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకుని మధ్యాహ్నం ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవ రథాన్ని ఆకుతోరణాలు, పూలతో అలంకరించారు. వేదపండితులు రథాంగ హోమం చేసి పూర్ణాహుతి నిర్వహించారు. తర్వాత శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాలతో రథంపై కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాలు డప్పుల వాయిద్యాల నడుమ రైల్వేరోడ్డు నుంచి ఆలయ వీధుల గుండా సాగిన బ్రహ్మరథోత్సవం మున్సిపల్ ఆఫీసు రోడ్డు వరకు సాగింది. ఈ సందర్భంగా జంగమదేవర వీరభద్ర వేషధార కళాకారుడు చేసిన నృత్యలు, వాయిద్య కళాకారుల విన్యాస్యాలు ఆకర్షించాయి. కార్యక్రమంలో అంబికా లక్ష్మీనారాయణ, సుబ్రమణ్యం శ్రీకాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సూగురు పోచనపల్లి సమీపంలోని ఏటిగడ్డ కాశీవిశ్వేశ్వర సుబ్రమణేశ్వరస్వామి ఆలయంలో షష్టి పూజలు ఘనంగా జరిగాయి.

పరిగి: సుబ్రహ్మణ్యషష్టి సందర్భంగా పరిగి, పైడేటి గ్రామాల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు తరలిరావడంతో క్యూలైన్లను ఏర్పాటు చేశారు. పైడేటిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వేద బ్రాహ్మణులు, పురోహితులు మధ్యాహ్న భోజనం ఆలయ కల్యాణ మండపంలో తిన్న తరువాత తిన్న విస్తర్ల (పులాకులు)ను భక్తులు తమ నెత్తిన మోశారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయడానికి పోటీ పడ్డారు. అనంతరం పక్కనే ఉన్న పెన్నా నదిలో వేశారు. భక్తులకు పరిగి దివ్య ఎడ్యూకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

మడకశిరరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ప్రజలు ఘనంగా సుబ్రహ్మణ్యం షష్టిని జరుపుకున్నారు. ఇళ్లను శుభ్రం చేసి పొలాలకు వెళ్లి అక్కడే వంటవార్పు చేసి భక్తిశ్రద్ధలతో నాగుల పుట్టకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పొలంలో భోజనం చేసి ఉపవాస దీక్షను విరమించారు.



అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి



పరిగి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



సూగూరు ఏటిగడ్డ వద్ద అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి



జమ్మానిపల్లి సమీపంలోని పొలంలో భోజనం చేస్తూ ఉపవాస దీక్షను విరమిస్తున్న భక్తులు



మడకశిర మండలం జమ్మానిపల్లిలో పొలంలో నాగుల పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు



పరిగి: క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

సందడిగా సంక్రాంతి



రొద్దం పెద్దాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రొళ్ల: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సోమవారం మకర సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు భోగి, సంక్రాంతి, కనుమ పండుగకు తరలిరావడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. మహిళలు వివిధ ఆకృతులతో కూడిన ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లల్లో పచ్చి వేరుశనగ, అనపకాయలు, గెణసు గడ్డలు, చెరుకు తదితర వాటిని దేవతల చిత్రపటం ముందు ఉంచి పూజలు చేశారు. ఇళ్లలో పెంచి పోషించుకుంటున్న ఆవులకు పూజలు చేసి గెణసు గడ్డలు, అనపకాయలు ఇతరాత్ర వాటిని నైవేద్యంగా సమర్పించారు.

అగళి: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. రైతులు పండించిన ధాన్యంతో పిండి వంటలు చేసుకొని ఆరగించారు. పలు గ్రామాల్లో గ్రామీణ క్రీడలు నిర్వహించారు.

రొద్దం: మండల వ్యాప్తంగా సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం మండల కేంద్రంలో అర్చకులు గిరీష్‌స్వామి ఆధ్వర్యంలో ఉదయం పెద్దాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ నడిబొడ్డున చిన్నారుల చేసిన చెక్కభజన చూపర్లను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో శ్రీరామ భక్త మండల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలో మకర సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం వేకువ జామున మహిళలు తమ ఇంటి ముందు వివిధ రకాల ముగ్గులు వేశారు. మండలంలోని గౌడనకుంటలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువతీ యువకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, యువతీ యువకులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి గౌడనకుంట డెవలప్‌మెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో బహుమతులను సంస్థ సభ్యులు అందజేశారు.



అగళిలో ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు



రొళ్ల మండలం టీడీ పల్లిలో ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు



గౌడనకుంటలో వివిధ పోటీల్లో విజయం సాధించిన వారితో జీడీఎఫ్ సభ్యులు

సీఎం జగన్‌ను కలసిన నాయకులు





సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, చౌళూరు మధుమతిరెడ్డి

హిందూపురం: గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామం వద్ద నాసిన్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హిందూపురం వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పాలసముద్రం హెలిప్యాడ్ వద్ద సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి కలసికట్టుగా హిందూపురంలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని సీఎం తెలియజేసినట్లు నాయకులు తెలిపారు.



చిలమత్తూరు మండలం మరవకొత్తపల్లి వద్ద జాతీయ రహదారిని కమ్మేసిన మంచు

మంచు దుప్పటి

జిల్లాలో కొన్ని రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఆహ్లాదం పంచుతోంది. రహదారుల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం 9 గంటలైనా లైట్లు వేసుకుని వెళ్లాల్సి వస్తోంది. ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో జనం వణుకుతున్నారు.

– చిలమత్తూరు:



చిలమత్తూరు చెరువు సమీపంలో వృక్షాలపై మంచు దుప్పటి

రేపు మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కవిత, ఎంపీడీఓ ఆజాద్ మంగళవారం తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడితో పాటు అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ మెంబర్ హాజరు కావాలన్నారు. మండలస్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో మండల సర్వసభ్య సమావేశానికి తప్పక హాజరు కావాలని సూచించారు.

యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన వేమారెడ్డి

పరిగి: మండలంలోని కాలువపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేమారెడ్డి అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పరిగి వైపు నుంచి సేవామందిరం వైపునకు ఆటో వెళ్తోంది. అలాగే నీటి ట్యాంకర్‌తో ఉన్న ట్రాక్టర్ అటు నుంచి వస్తోంది. కాలువపల్లి సమీపంలోని ప్రమాదకర మలుపు వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన శ్రీరామరెడ్డి కుమారుడు వేమారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన హిందూపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. కాగా ఈ ప్రమాదంపై ఇంతవరకూ తమ కెలాంటి ఫిర్యాదు అందలేని పోలీసులు తెలిపారు.

బార్‌లో ఇరువర్గాల ఘర్షణ

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజవంతి గ్రామ సరిహద్దులో ఉన్న రిలాక్స్ బార్ అండ్ రెస్టారెంట్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు అందించిన వివరాల మేరకు... మడకశిర మండలం ఎగువ అచ్చంపల్లికి చెందిన గోపాల్ నాయక్, సురేశ్ నాయక్, ఆమిదాలగొంది గ్రామానికి చెందిన సంజయ్ స్థానిక రిలాక్స్ బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవించడానికి సోమవారం రాత్రి వచ్చారు. అదే సమయంలో స్థానిక రాజవంతి గ్రామానికి చెందిన కారు డ్రైవర్ మనోజ్, అశోక్, కొత్తకోట గ్రామానికి చెందిన అనిల్ కూడా మద్యం సేవించడానికి వెళ్లారు. ఈ సందర్భంగా మద్యం మత్తులో పార్సిల్ విషయంలో వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గోపాల్ నాయక్, సురేశ్ నాయక్, సంజయ్ కోడికత్తులతో కర్ణాటకకు చెందిన మనోజ్, అశోక్, అనిల్‌పై దాడి చేశారు. ఈ దాడిలో మనోజ్ తీవ్రగాయాలు పాలయ్యాడు. వెంటనే అతన్ని తుమకూరు ఆస్పత్రికి తరలించారు. అశోక్, అనిల్ స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిందితులు గోపాల్ నాయక్, సురేశ్ నాయక్, సంజయ్ కుమార్‌లను పావగడ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి నాలుగు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.4 లక్షలతో కాలువ నిర్మాణ పనులు



కాలువ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

హిందూపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి తామెప్పుడూ ముందుంటామని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి తెలిపారు. హిందూపురం మండలంలోని కిరికెర పంచాయతీ వివర్స్ కాలనీలో రూ.4 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న కాలువ నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యలు పట్టించుకోవాల్సిన ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రజలకు కనిపించకుండా హైదరాబాదులో ఉంటున్నారన్నారు. సినిమా షూటింగ్‌లకే పరిమితమై పురం ప్రజలను ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపికకు ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, ఎంపీటీసీలు ధనుంజయరెడ్డి, కవిత, వైస్ సర్పంచ్ నరేంద్ర, సర్పంచ్ దేవరాజు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఫారుక్, నాయకులు మంజునాథ్, రంగయ్య, రామాంజి, శ్రీరాములు, ప్రభాకర్, నరసింహులు, బసప్ప, షాజహాన్, ఆయుబ్ నవీన్, తదితరులుపాల్గొన్నారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

రొద్దం: మండలంలోని కందుకూర్లపల్లి, చిన్నకోడిపల్లి, కల్లుకుంట, నల్లూరు, చోళేమర్రి, బొమ్మిరెడ్డిపల్లి, పాత గొబ్బరంపల్లి, కొత్తగొబ్బరంపల్లి, సానిపల్లి తదితర గ్రామాల్లో స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి, పెనుకొండ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం ఉదయం 8 గంటలను పర్యటన ప్రారంభమవుతుందని పేర్కొంది.

వ్యక్తికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి సమీపంలో మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. హిందూపురం వైపు నుంచి విజయవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంలో పెనుకొండ నుంచి హిందూపురం వైపు వెళ్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని వివరాలు కూడా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సుతో పాటు ద్విచక్ర వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.